

సమయం సాయంత్రం అయిదున్నర గంటలు. పక్షులు గూటికి చేరేవేళ. స్కూలు నుండి పుస్తకాలతో బస్సులతో యుద్ధంచేసి వాడిన ముఖాలతో పిల్లలు తల్లుల దగ్గరకు, ఆఫీసు పక్షులు ఇళ్లకు చేరేవేళ.

సునీల్ ఆఫీసు నుండి వచ్చి చరిత అందించిన వేడి వేడి కాఫీ తాగి షైప్ విప్పుకుంటూ ఖాళీకప్పుతో లోనికి వెళ్లబోతున్న చరితను జడపట్టుకుని గుంజేడు.

చరిత "అబ్బా ఉండండి, వచ్చి పది నిముషాలు కాలేదు. అప్పుడే మొదలెట్టారు అల్లరి. పెళ్ళి అయి సంవత్సరం అయింది. ఇంకా కొత్త పెళ్ళికొడుకులా మీరూ మీ చిలిపి చేష్టలూనూ" అంది చిరుకోపంతో.

"మా శ్రీమతి దగ్గర నే నెప్పుడూ కొత్త పెళ్ళికొడుకునే. నీ దగ్గర కాకపోతే ఇంకెవరి దగ్గర చేస్తానోయ్ నేను అల్లరి."

"అయినా నేను మీ గోల భరించలేక పోతున్నానండీ, దయచేసి నన్ను అల్లరి పెట్టకుండా ఇంకెవరి దగ్గరైనా చేయండి మీ చిలిపి చేష్టలూ అవి".

"మీరు రిక్వెస్ట్ చేస్తే మీ మీద గల ప్రేమతో తప్పనిసరిగా మీ కోర్కె మన్నిస్తాం. ఆలోచించి ఆచరిస్తాం" అన్నాడు, చిలిపిగా మొహం పెట్టి సునీల్.

"అబ్బబ్బా మీతో మాట్లాడి నేను నెగ్గలేనుకానీ, ఇంతకీ తమరి కోరికేమిటో చెప్పండి. ఆలోచించకుండా తీర్చేస్తాము" అంది అదే ఫక్కీలో చరిత.

"ఏదీ నువ్వు చెప్పనిస్తేగా. హుషారుగా వచ్చిన భర్తకు ఏం కావాలో కనుక్కోకుండా వాదనలోకి దించి చెప్పాలనుకున్న గుడ్ న్యూస్ చెప్పనివ్వకుండా టైము వేస్టు చేసేసేవు కదా. అయినా చెప్తేస్తున్నాను కాచుకో. మీ నాన్నగారి దగ్గర్నుండి లెటర్ వచ్చింది. మీ చెల్లెలికి పెళ్ళట. మరలా ఆరు నెలల దాకా ముహూర్తాలు లేనందున ఇరవయి రోజుల్లో తగిన ముహూర్తం ఉంటే పెట్టేసేరట. అందుచే నన్ను సపరివార సమేతంగా అంటే నీతో కలసి వెంటనే వచ్చేయమని ఆహ్వానించేరు. చూశావా నీకు ఎంత మంచిన్యూస్ చెప్పేనో మరి నాకు ఏమిస్తావు చెప్పు" అని చరితను చూసేడు.

అప్పటికే తండ్రి వ్రాసిన ఉత్తరం చదివేసి మడత పెడుతూ "మరి మనమెప్పుడు వెళదామండీ" అంది చరిత.

"ఏమిటి, మనమే. నేను ఇప్పటి నుండీ లీవు అడిగితే ఏకంగా పెర్మినెంట్ లీవ్ శాంక్షన్ చేసేసి పంపించేస్తాడు మా బాస్. అయినా ఇప్పట్నుంచీ ఎందుకులే. పెళ్ళి వారం రోజులు ఉందనగా ఇద్దరం కలసి వెళ్దాములే" అన్నాడు సునీల్. చరిత మరి మాట్లాడకుండా లోనికి వెళ్ళిపోయింది.

ఆ రాత్రి భర్త పక్కన చేరి ఈలోకాన్ని మరచిపోయిన వేళ రెండు రోజుల్లో తను పుట్టింటికి వెళ్ళిపోవడానికి, పెండ్లి వారం ముందనగా అతను రావడానికి సునీల్‌ను ఒప్పించింది చరిత.

అనుకున్నట్టుగానే భర్తకు అన్ని జాగ్రత్తలూ చెప్పి బయలుదేరి కన్నవారిల్లు చేరింది. పెళ్ళికి వారంముందుగా వస్తానన్న భర్త రాకపోగా, పెండ్లి ముందురోజు తన ఆఫీసులో పై అధికారుల విజిట్స్ కారణంగా తనకు లీవు దొరక లేదనీ రాలేక పోయినం

దుకు బాధ పడవద్దని లెటర్ వచ్చింది సునీల్ వద్దనుండి చరితకు.

పెండ్లి సమయానికి అనుకోని కారణాల వలన డబ్బు చేతికి రాకపోవడంతో ఇస్తానన్న కట్నం డబ్బు పెండ్లి సమయానికి మగ పెండ్లివారికి ఇవ్వలేక పోయాడు చరిత తండ్రి.

"మిగిలినసొమ్ము ఇస్తేనేకాని నాకొడుకు మీ అమ్మాయి మెడలో తాళి కట్టడ"ని తెగేసి చెప్పేసేడు అబ్బాయి తండ్రి.

"ఇప్పుడే మాట నిలబెట్టుకోలేని మనుషులు రేపొద్దున్న పెళ్ళయేక ఏముద్దు ముచ్చట్లు జరుపుతారు" అనే వియ్యపురాలి మాటలు విని అవమానంతో తల వంచుకున్నాడు చరిత తండ్రి.

ఉన్నత విద్య నభ్యసించి, ఉన్నత పదవి నలంకరించి కూడా తండ్రి అనే మాటలు వింటూ వ్యక్తిత్వంలేని వ్యక్తిగా తండ్రి చాటు బిడ్డడిగా నోరు మెదపకుండా కూర్చున్న పెండ్లి కొడుకును చూస్తే అసహ్యం వేసింది చరితకు.

నిస్సహాయుడై ఏమి చేయాలో పాలుపోక ఆడపిల్లను కన్న పాపానికి అందరి ముందూ తలవంపులైన తండ్రిని చూసి భరించలేక పోయింది చరిత. తనకు జన్మనిచ్చి ప్రాణానికి ప్రాణంగా పెంచి విద్య చెప్పించిన తండ్రికి తను ఏవిధంగా సాయపడగలదు అని ఆలోచించింది.

తన వంటి మీది నగలు తీసి మిగిలిన డబ్బుకు బదులుగా నీటిని పెండ్లి వారికి ఇవ్వమని తండ్రికి ఇచ్చింది.

చరిత తండ్రి "వద్దమ్మా ఒక కూతురు బాగుకోసం ఇంకొక కూతురు బ్రతుకులో నిప్పులు పోయలేనమ్మా, ఇది తెలిస్తే అల్లుడుగారు నిన్ను గుమ్మం తొక్కనిస్తారా వద్దమ్మా వద్దు" అన్నాడు.

"నేను నాన్నా ఆయన అంత కుసంస్కారి కాదు. కన్నతండ్రిని అవసరానికి ఆదుకోవడానికి నా నగలు పనికివచ్చాయంటే సంతోషిస్తారే తప్ప కోపగించుకోరు. వియ్యాలవారికి కావాల్సింది డబ్బేకదా అది ఎలాతెస్తేనేం దానికోసం ఎంతమంది ఏడిస్తేనేం. ఇన్నాళ్ళూ కొడుకుని పెంచినందుకు వాళ్ళకి కావాల్సింది కిట్టుబాటయే ధర అంతే కదా ఇది తీసుకువెళ్ళి వాళ్ళకి ఇచ్చి జరగాల్సింది జరిపించు. వెళ్ళు నాన్నా వెళ్ళు" అని తండ్రిని పంపించింది చరిత.

నగలు చేతిలో పడగానే వికసించిన ముఖాలతో పెండ్లిలో పాల్గొన్న పెండ్లి వార్ని చూస్తే అసహ్యం, తండ్రిమాట శిరసావహించి తన ధర తానే నిర్ణయించుకుని తనను తానే విక్రయించుకున్న పెండ్లి కొడుకును చూస్తే జాలి కలిగేయి చరితకు.

అటువంటి వ్యక్తితో కాపురం ఏవిధంగా ఉంటుందో, తనవైవాహికజీవితం ఏ మలుపులు తిరుగుతుందో అని బాధగా తలుస్తూ భర్త దగ్గరికి ప్రయాణమైంది చరిత.

తను నగలు ఇచ్చేసిన విషయం చెపితే సునీల్ ఏమంటాడో. ఎంత మంచివాడైనా అతనూ అందరిలాంటి మనిషే కదా! అనుకుంటూ తనయింటికి చేరింది చరిత.

ఆరోజు రాత్రి జరిగిన సంగతంతా భర్తకు చెప్పి అతని రియాక్షన్ ఎలా వుంటుందో అని చూస్తూ కూర్చుంది.

అంతా మౌనంగా విన్న సునీల్ "చాలా మంచిపని చేశావు చరితా. నిన్ను కని పెంచినందుకు ఇంత మంచి మనసున్న నిన్ను నాకు ఇచ్చినందుకు వారి కోసం నీవు ఏంచేసినా తక్కువే. నీ నగలు పదిమందిలో నీ తండ్రి పరువు నిలపడానికి ఉపయోగపడ్డాయంటే నాకు చాలా ఆనందంగా ఉంది. స్త్రీలకు అతి ప్రియమైన నగలను నీవు అంత తేలికగా వదులుకున్నావంటే వ్యక్తిగా నీవు ఎంత ఎదిగేవో తెలుస్తోంది" అన్నాడు.

భర్త మాటలు విన్న చరిత అతని విశాల హృదయానికి మనసులోనే జోహారు అర్పించింది.

"ఏమిటో రాణీగారు ఏదో ఆలోచిస్తూ ఈ దాసుని సంగతే మర్చిపోయారు. తమరి కల ఏమిటో మాకు కూడా కొంచెం చెప్పవచ్చుకదా. ఇన్నాళ్ళ విరహం తరువాత కూడా ఈ వంటరి నిద్రేనా" అన్న సునీల్ కొంటె మాటలకు సిగ్గుపడి అతని కౌగిలిలో ఒదిగిపోయింది చరిత.

## త్వమేవశరణం

— దోనేపూడి రాజారావు

నేనా—నేడు
తమోమయ మహామోహంలో
చిక్కుకున్నాను
రాక్షసుడిలా బ్రతుకుతున్నాను—
సుఖభోగాల్తో కాలి బూడిదై పోతున్నాను
నోట మాట లేదు
కంటి చూపు లేదు
చెవికి వినికిడి లేదు
ఇప్పుడు నేనేం కావాలి
నాకిప్పుడెవరు దిక్కు ?
అంతః కరణంలో దాగున్నావో
వైశ్వానరాగ్ని—వో అత్మన్!
త్వమేవశరణం !
త్వమేవశరణం !!

